సాక్షి ఒడిశా

శనివారం । 18 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4.07.164
బంగారం	500 మిల్లీ గ్రాములు
వెండి	17 గ్రాములు 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

'అత్యధిక మెజారిటీతో గెలుస్తాం'



కాంగ్రెస్ కంచుకోట అయినటువంటి గుమ్మా సమితిలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బిజయ పట్నాయక్ అత్యధిక మెజారిటీతో గెలవనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎ.జైమినిరావు అన్నారు.

-10లో



ఇంజినీర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ప్రదానం

-10లో

ఎఫ్ఈఐఏపీ ప్రదానం చేసే ఇంజినీరు ఆఫ్ ది ఇయర్ అవార్డు ఈసారి రాష్ట్రానికి చెందిన రఘు పాత్రుని భీమారావుకు లభించింది.

న్యూస్‌రీల్

బీజేడీ నాయకురాలు మిస్సింగ్



పుష్పాంజలి కద్రక

జయపురం: కొరాపుట్ జిల్లా బందుగాం సమితి బీజేడీ ఉపాధ్యక్షురాలు పుష్పాంజలి కద్రక గత మూడు రోజులుగా కనిపించడం లేదు. ఆమె తన భర్త సీతయ్య కద్రక, ఇద్దరు బిడ్డలతో కలిసి బందుగాం సమితి సర్దెలి గ్రామంలో నివాసముంటున్నారు. ఆమె భర్త సీతయ్య కద్రక తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 16వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో లక్ష్మీపూర్ వెళ్లి వస్తానని చెప్పి తన భార్య పుష్పాంజలి వెళ్లిందన్నారు. అలా వెళ్లిన ఆమె తిరిగి రాలేదని వెల్లడించాడు. తాము అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికైనా ఆమె కనిపిస్తే తమకు తెలియజేయాల్సిందిగా కోరారు.

నాటుసారా బట్టీలపై దాడులు



నాటుసారా పారబోస్తున్న దృశ్యం

జయపురం: సమితిలోని డిమ్లా గ్రామ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న బట్టీలపై ఎక్సైజ్ సిబ్బంది గురువారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో వండిన నాటుసారా 60 లీటర్లు, 900 లీటర్ల ఇప్పమొగ్గతో పాటు ఊటను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు అధికారులు తెలియజేశారు. వాటి విలువ సుమారు రూ.54 వేలు ఉంటుందని నీలాద్రి బిహారి మిశ్ర వెల్లడించారు. అయితే నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తులు పారిపోయారని పేర్కొన్నారు. సారా వంటకానికి వినియోగించే సామగ్రి సీజ్ చేశామన్నారు.

ఏనుగుల బీభత్సం



ధ్వంసమైన చేసిన సోలార్ ప్లేట్లు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సునాఖండి పంచాయతీలో గురువారం రాత్రి ఏనుగులు బీభత్సాన్ని సృష్టించాయి. పంచాయతీ పరిధి బరియాపాడ, శిలాపాదొరొ, సరాటి, పార్టీబెడ గ్రామాల్లోకి చొరబడ్డాయి. బరియాపాడ గ్రామంలో ఉన్నటువంటి సోలార్ ప్లేట్లను ధ్వంసం చేయగా, సరటి గ్రామంలో జమాప్రప్కా అనే ఆదివాసీ రైతుకు సంబంధించిన పనస, అరటి, మామిడి తోటలను ధ్వంసం చేశాయి. గత కొద్ది నెలలుగా ఈ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ సిబ్బంది కొరత కారణంగా ఏనుగుల గుంపును తరిమికొట్టడంలో విఫలం చెందుతున్నారు. పొరుగు జిల్లా కలహండి అడవుల నుంచి ఇటువైపుగా వచ్చిన ఏనుగులు ఈ ప్రాంతంలో పనస, అరటి వంటి తోటలు విరివిగా ఉండటంతో ఇక్కడే తిష్టవేసినట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని ఏనుగుల నుంచి కాపాడాలని బాధిత గ్రామస్తులు కోరుతున్నారు.

మాజీ మంత్రి లాల్‌బిహారికి భార్య వియోగం



అప్పలమ్మ (ఫైల్)

రాయగడ: రాష్ట్ర మాజీ మంత్రి, బీజేడీ సీనియర్ నాయకుడు లాల్‌బిహారి హిమిరికకు భార్య వియోగం కలిగింది. అతని భార్య అప్పలమ్మ హిమిరిక (69) శుక్రవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను పెంట గ్రామంలోని స్వగృహంలో చికిత్స అందిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించడంతో శుక్రవారం ప్రాణాలు విడిచారు. ఆమెకు ముగ్గురు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతిపై బీజేడీ నాయకులు, కార్యకర్తలు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

అల్లర్లపై దర్యాప్తునకు సిట్

- 30 రోజుల్లో చార్జిషీట్‌కు ఆదేశాలు



భువనేశ్వర్: గంజాం జిల్లా ఖల్లికోట్ ప్రాంతంలో ఒక వ్యక్తి ప్రాణాలను బలిగొన్న ఎన్నికల హింసాత్మక ఘటనపై దర్యాప్తు చేసేందుకు ఒడిశా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. ఈ విచారకర ఘటనలో భారతీయ జనతా పార్టీ కార్యకర్త మరణించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో నిందితులను అరెస్టు చేశారు. సరైన సాక్ష్యాలను (వైజ్ఞానిక, ఫోరెన్సిక్, డిజిటల్) సేకరించి 30 రోజుల్లో ఛార్జిషీట్‌ను దాఖలు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు విచారణ వేగవంతం చేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సిట్ ఎప్పటికప్పుడు స్థాయీ నివేదికను దక్షిణ ప్రాంతీయ ఇన్‌స్పెక్టరు జనరల్ ఆఫ్ పోలీస్‌కి దాఖలు చేస్తుందని అధికారిక ప్రకటన తెలిపింది.

ఖల్లికోట్ ముందస్తు ఎన్నికల హింసాత్మక సంఘటనల దృష్ట్యా, ఎన్నికల సమయంలో గంజాం జిల్లాలో శాంతిభద్రతలను పర్యవేక్షించడానికి అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రాధాకృష్ణ శర్మ శుక్రవారం నుండి ఈ నెల 21 వరకు ఛత్రపురంలో క్యాంప్ చేయనున్నారు.

కార్యకర్తల ఘర్షణ

రాష్ట్రంలో రెండో విడత ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఖల్లికోట్ పోలీసు ఠాణా పరిధిలోని శ్రీకృష్ణశరణ్‌పూర్ గ్రామంలో బుధవారం రెండు వర్గాల రాజకీయ కార్యకర్తల మధ్య ఘర్షణ ప్రాణాంతకంగా మారింది. బీజేపీ కార్యకర్త మృతి చెందగా, మరో 3 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘర్షణలో అదే గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ పహన్ అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలై ఎంకేసీజీ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బీజేడీ కార్యకర్తల అసంతృప్తివాదంతో ఈ వివాదానికి ప్రేరణగా భావిస్తున్నారు. ఆశించిన మేరకు బీజేడీ టికెటు లభించకపోవడంతో రెండుగా చీలిన వర్గాల మధ్య ఘర్షణ తారా స్థాయికి చేరింది. అయితే ఖల్లికోట్ అసెంబ్లీ స్థానానికి అభ్యర్థి ఎంపికపై అసంతృప్తి చెందిన వర్గం ఇటీవల బీజేపీలో చేరారని అనుబంధ వర్గాలు తెలిపాయి. అనంతరం దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఖల్లికోట్ పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేపీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఖల్లికోట్, భువనేశ్వర్ మధ్య రోడ్లను దిగ్బంధించి రాకపోకలకు అంతరాయం కలిగించారు. ఘటనకు సంబంధించి ఇప్పటివరకు తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. కాగా హింసాకాండ నేపథ్యంలో మే 20న ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక లోక్ సభ స్థానానికి ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా నిర్వహించేందుకు గంజాం జిల్లాలో 20 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించాలని ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి నికుంజ బిహారీ ధొలా ఆదేశించారు.

తాగునీటి కోసం ఆందోళన



సమితి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

పర్లాకిమిడి: కాశీనగర్ ఎన్ఏసీలో తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ మహిళలంతా కలిసి సమితి కార్యాలయం ఎదుట బిందెలు, బకెట్లతో శుక్రవారం ఆందోళన జరిపారు. దీనిలో భాగంగా కాశీనగర్ ఎన్ఏసీ బ్లాక్ ఆరోగ్య కేంద్రం రోడ్డులో వాహనాలను నిలిపివేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గత ఆరు నెలలుగా కాశీనగర్ ఎన్ఏసీ, గ్రామీణ తాగునీటి శానిటేషన్ ఇంజినీర్లు, కాశీనగర్ బీడీవోకు తాగునీటి కోసం మొరపెట్టుకున్నా అధికారులు స్పందించలేదని, అందువల్ల ఆందోళన చేస్తున్నామని మహిళలు పేర్కొన్నారు.



ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా

వెంటనే పోలీసు అధికారులు చొరవ తీసుకుని ప్రైవేటు వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు.

బలి జాతరకు ఇసుక సంగ్రహణ



ఇసుక కోసం నదికి వెళ్తున్న శొశాహండి మహిళలు

జయపురం: ఖరీఫ్ సీజన్ సమయంలో కొరాపుట్ ఆదివాసీ ప్రజలు జరుపుకునే వ్యవసాయ సంబంధిత బలిజాతర పండగ ఒకటి. ఈ జాతర జరపడం వలన పంటలు బాగా పండుతాయని, తమ కుటుంబాలు ఆయురారోగ్యాలతో ఉంటారని అక్కడి ప్రజల నమ్మకం. అటువంటి బలి జాతరకు బొరిగుమ్మ సమితి శొశాహండి పంచాయతీ ప్రజలు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు గ్రామ మహిళలంతా బుట్టలతో నువాగుడ గ్రామ సమీపంలోని చిరుశ్రోత నదికి వెళ్లి ఇసుక నింపుకొని, వాటిలో వివిధ రకాల విత్తనాలు చల్లి తమ గ్రామంలో ఉన్న దేవత గుడిలో ఉంచారు. గ్రామ సాంప్రదాయం ప్రకారం ఈనెల 28వ తేదీన బలి జాతర మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. బుట్టల్లో వేసిన విత్తనాల్లో మొలకెత్తిన విత్తనాలను ఖరీఫ్ సీజన్‌లో పండిస్తే మంచి దిగుబడి వస్తుందని ప్రజల నమ్మకం.

ఎన్నికల ప్రచారానికి కొరాపుట్ నేతలు



బబిదాస్‌తో కలిసి ప్రచారం చేస్తున్న రమేష్ మజ్జి, దేవాశిస్ పాత్రోలు



రామభద్రపురం వద్ద కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: మొదటి దశ సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసింది. దీంతో ప్రముఖ పార్టీలు మెదటి దశలో ప్రచారంలో పాల్గొన్న నేతలను మిగతా ప్రాంతాలకు తరలించాయి. అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన ముఖ్య నాయకులు ఎన్నికలు జరగాల్సిన ప్రాంతాలకు వెళ్లారు. నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం అసెంబ్లీ స్థానం నుంచి బీజేడీ అభ్యర్థిగా పనిచేసిన ఎంపీ రమేష్ చంద్ర మజ్జి సంబల్‌పూర్ తరలి వెళ్లారు. ఆ స్థానంలో పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పనిచేస్తున్న బబి దాస్ కోసం ప్రచారం చేయనున్నారు. శుక్రవారం కుటింద అసెంబ్లీ స్థానంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేడీ నబరంగ్‌పూర్ అదనపు పరిశీలకుడు దేవాశిస్ పాత్రో, జిల్లాకి చెందిన రాష్ట్ర మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ ప్రమోద్ పాఢీలు పాల్గొన్నారు. ఇదే నియోజకవర్గంలో రాయగడ జిల్లాకి చెందిన బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావులు ప్రచారం చేస్తున్నారు. భద్రక్ జిల్లాలో కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి ప్రచారం చేస్తున్నారు. కొరాపుట్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన ఎంపీ సప్తగిరి ఉల్క ఎన్నికల ప్రచారానికి వెళ్తూ ఆంధ్రలోని రామభద్రపురం వద్ద స్థానిక మీడియాతో మాట్లాడారు.



భద్రక్ జిల్లాలో ప్రచారం చేస్తున్న ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



నుజ్జునుజ్జయిన బైక్



జోగేస్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలైన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి కృష్ణానగర్ గ్రామ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మృతుల్లో విశ్వజిత్ (29), జోగేష్ మినియాక (32)లు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న కల్యాణ సింగుపూర్ ఐఐసీ నీలకంఠ నాయక్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించి నాయక్ తెలియజేసిన వివరాల ప్రకారం.. రైల్వే కార్మికుడిగా పనిచేస్తున్న విశ్వజిత్ పనులు ముగించుకుని సికరపాయి నుంచి రాయగడకు వస్తున్నాడు. ఈ క్రమంలో కృష్ణానగర్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన నీలగిరి కర్రల లోడుతో ట్రాక్టర్ ఆగి ఉంది. ట్రాక్టర్ డ్రైవర్ జోగేష్ మినియాక రోడ్డుకు పక్కగా నిలుచున్నాడు. అతివేగంతో బైకుపై వస్తున్న విశ్వజీత్ అదుపు తప్పి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. దీంతో ట్రాక్టర్ సమీపంలో నిల్చున్న జోగేష్‌తో పాటు విశ్వజీత్‌కు తీవ్రగాయాలవ్వడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్



దేభశిష్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి ఎంవీ 26 గ్రామానికి చెందిన దేభశిష్ సర్కార్ (32) అనే వ్యక్తి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బలైపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. దేభశిష్ గత కొన్ని నెలలుగా ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నాడు. దీంతో బెట్టింగ్స్‌లో ఓడిపోయి ఊరంతా అప్పులు పాలయ్యాడు. ఇటీవల అప్పులు ఇచ్చినవారు డబ్బులు అడగగా, అందరికీ శుక్రవారం ఇస్తానని చెప్పాడు. అనంతరం కుటుంబ సభ్యులతో గురువారం రాత్రి సంతోషంగా గడిపాడు. శుక్రవారం వేకువజామునే లేచి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. తీరా చూస్తే ఉదయం 6 గంటల సమయంలో ఇంటికి కొంతదూరంలోని చెట్టుకు ఉరికి వేలాడుతూ కన్పించాడు. దీంతో గ్రామస్తులు వెంటనే మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దేభశిష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విప్పపువ్వు బస్తాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ట్రక్‌తో పోలీసులు

రాయగడ: స్థానిక సిరికొన సమీపంలో ఎక్సైజ్ అధికారులు గురువారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో 2,800 కిలోల విప్పపువ్వు బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి చంద్ర గరడియా అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. గత కొద్ది రోజులుగా ఎక్సైజ్ అధికారులు నిర్వహిస్తున్న విస్తృత దాడుల్లో భాగంగా గురువారం సిరికొన గ్రామ సమీపంలో అనుమానస్పదంగా కనిపించిన ఒక మినీ ట్రక్‌ను ఆపి తనిఖీ చేశారు. దీనిలో నాటుసారా తయారీకి వినియోగించే విప్పపూల బస్తాలు బయటపడ్డాయి. దీంతో కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఐఐసీ సంజయ్ కుమార్ ప్రధాన్, ఎస్ఐ రాసి నాయక్, సంగ్రామ్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

లమతాపుట్ జలాశయంలో పడవ బోల్తా



జలాశయం వద్దకు చేరుకున్న ప్రజలు

- వ్యక్తి గల్లంతు



గాలిస్తున్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది

జయపురం: లమతాపుట్ జలాశయంలో గురువారం ఒక నాటు పడవ బోల్తాపడడంతో వ్యక్తి గల్లంతైన ఘటన చోటుచేసుకుంది. గల్లంతైన వ్యక్తి బిలాపుట్ పంచాయతీ జబాగుడ గ్రామానికి చెందిన సుకు ప్రధాన్(39)గా గుర్తించారు. అతడు గురువారం మధ్యాహ్నం తన జీడిమామిడి తోటకు బయల్దేరాడు. తోటకు వెళ్లేందుకు మధ్యలో లమతాపుట్ జలాశయం ఉండడంతో నాటు పడవలో వెళ్తుండగా బోల్తాపడింది. జలాశయ పరివాహక ప్రాంతంలో వేరుశనగ పంట పొలంలో పనిచేస్తున్న రైతులు పడవ మునిగిపోవడం చూశారు. వెంటనే అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం వారు స్థానిక సర్పంచ్ రాజు లెద్రకు తెలియజేయగా ఆయన జోళాపుట్ పోలీసులకు సమాచారం అందించారు. జోళాపుట్ ఏఎస్ఐ సంతోష్ కుమార్ పారిడ, లమతాపుట్ ఎస్ఐ గోవింద హన్సద, నందపూర్ అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని జలాశయంలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి అయినా జాడ తెలియకపోవడంతో తిరిగి శుక్రవారం ఉదయం నుంచి గాలిస్తున్నారు. ఈ ఘటనతో సమీప ప్రాంతాల్లో విషాదం నెలకొంది.

వ్యాపార ప్రత్యర్థిపై దాడి

- దిగపహండి కాంగ్రెస్ అభ్యర్థి అరెస్ట్



సాకా సుజిత్ కుమార్

భువనేశ్వర్: గంజాం జిల్లాలో శుక్రవారం మరో ఎన్నికల వివాదం చెలరేగింది. వ్యాపార ప్రత్యర్థిపై దాడి చేసిన ఆరోపణ కింద కాంగ్రెసు టిక్కెట్టుపై పోటీ చేస్తున్న అభ్యర్థిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ ఘటనలో గంజాం జిల్లా దిగొపహండి శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సాకా సుజిత్ కుమార్ అరెస్టయ్యారు. ఘటనపై బరంపురం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సార్థక్ షడంగి మాట్లాడుతూ దాడిలో సిహాలాకు చెందిన సుధాంశు సంగ్రామ్ పాఢి అనే బిల్డర్‌తో సహా ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారని తెలిపారు. కుకుడాఖండి ప్రాంతంలోని ఒక ప్లాట్‌లో పని చేస్తున్న సుధాంశు సంగ్రామ్ పాఢి సిబ్బందిపై కొందరు దుండగులు దాడి చేశారు. పాఢి మరియు అతని సిబ్బంది ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లుండగా, కాంగ్రెస్ అభ్యర్థి, అతని వ్యక్తులు వారిపై దాడి చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సహచరుడు కె.అమిత్ కుమార్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

క్లుప్తంగా

'అత్యధిక మెజారిటీతో గెలుస్తాం'



పర్లాకిమిడి: కాంగ్రెస్ కంచుకోట అయినటువంటి గుమ్మా సమితిలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బిజయ పట్నాయక్ దాదాపు 30 వేల ఓట్ల అత్యధిక మెజారిటీతో గెలవనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎ.జైమిని రావు అన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే త్రినాథ సాహు, 2009లో మాజీ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు గుమ్మ సమితిలో గెలిపొందిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో విశ్రాంత శాసన ముఖ్యకార్యదర్శి బిజయ పట్నాయిక్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చారన్నారు.

విజయదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ



అలంకరణలో విజయదుర్గ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక నానుబాలవీధిలో వేంచేసిన విజయదుర్గా దేవి ఆలయంలో ఫల్గుణమాస శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

టీడీపీ బెదిరింపులపై ఫిర్యాదు



కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడుకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ నాయకులను బెదిరిస్తున్నారని కాశీబుగ్గ పోలీసులకు వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఉదయం 11 గంటలకు కాశీబుగ్గ స్టేషన్‌కు చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బెదిరింపులకు సంబంధించి ఆధారాలతో కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదును ఎస్ఐ పారినాయుడుకు అందించారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్ సీపీ ముఖ్యనాయకులు బోర కృష్ణారావు, డబ్బీరు భవానీశంకర్, పీవీ సతీష్, మల్లా సురేష్‌బాబు, శంకర్‌పండా, తూముల శ్రీనివాసరావు, సనపల సింహాచలం, రోణంకి శ్రీనివాసరావు, పోతనపల్లి హరిప్రసాద్, పెంట రత్నాకర్, కొంచాడ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అందుబాటులోకి రెండు లిఫ్ట్‌లు



పనిచేస్తున్న లిఫ్ట్

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో ఉన్న ఎలక్ట్రికల్ లిఫ్ట్‌లు ఎట్టకేలకు పనిచేస్తున్నాయి. స్టేషన్‌కు ప్రారంభంలో ఉన్న లిఫ్ట్ పనిచేస్తుండగా రెండో నంబర్ ప్లాట్‌ఫాంలో ఉన్న లిఫ్ట్ ఇటీవల పాడైంది. తరచూ మరమ్మతులు చేస్తున్నప్పటికీ ఇబ్బందిగా మారడంతో సంబంధిత అధికారులు విచ్చేసి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకుని వచ్చారు.

కారు అద్దెకు తెచ్చి.. తాకట్టు పెట్టి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఇటీవలే రామలక్ష్మణ కూడలి సమీపంలోని ఫుడ్ కోర్టు యాజమాన్యంపై దాడికి పాల్పడిన కె.శేఖర్ అనే వ్యక్తిపై మరో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. శేఖర్ విశాఖపట్నంలోని ఎస్‌కెఎంఎల్ పేరు గల కార్ల కంపెనీకి వెళ్లి ఓ కారును అద్దెకు తీసుకున్నాడు. అద్దె చెల్లించడంలో జాప్యం చేయడంతో వారికి అనుమానం వచ్చి శేఖర్‌ను సంప్రదించారు. అయితే అతను కారుకు ఉండే జీపీఎస్ ట్రాకర్‌ను తొలగించాడు. దీంతో బాధితులు రెండో పట్టణ పోలీసులను శుక్రవారం ఆశ్రయించారు. ఈ విషయం సీఐ ఉమామహేశ్వరరావు వద్ద ప్రస్తావించగా తమ దృష్టికి విషయం వచ్చిందని, విచారణ చేస్తున్నామన్నారు. శేఖర్‌పై 2023లోనే రౌడీషీట్ ఉండటం, శుక్రవారం రెండో పట్టణ సీఐ నిర్వహించిన కౌన్సిలింగ్‌కు కూడా గైర్హాజరవ్వడం విశేషం.

యువకుడి దారుణ హత్య

- శ్రీకాకుళం పరిధి గూనపాలెంలో ఘటన
- మృతుడు పారిశుధ్య ఒప్పంద కార్మికుడు
- మేడపై నిద్రిస్తుండగా గొంతు కోసి చంపేసిన వైనం



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్, సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని గూనపాలెంలో గురువారం అర్ధరాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. మేడపై తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో గొంతుకోసి పారిపోయారు. రెండేళ్ల కిందట ఇదే ప్రాంతంలో గొడ్డలితో ఓ వ్యక్తిని చంపడం అప్పట్లో సంచలనమైన సంగతి తెలిసిందే. ఒకటో పట్టణ పోలీసులు, మృతుని భార్య, స్థానికులు చెప్పిన వివరాల్లోకి వెళ్తే..

పురపాలక శాఖలో పారిశుధ్య ఒప్పంద కార్మికునిగా పనిచేస్తున్న సీరా సురేష్ (33)కు తిరుమల అనే మహిళతో 14 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి 13 ఏళ్ల కుమారుడు, ఎనిమిదేళ్ల కుమార్తె ఉన్నారు. సురేష్ భార్య తిరుమల నగరంలోని ఓ హోటల్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 20న వారి పెళ్లి రోజు కావడంతో గురువారం సాయంత్రం భార్య, పిల్లలతో కలిసి సురేష్ షాపింగ్ కోసం బయటకు వెళ్లి అన్నీ కొనుక్కుని ఇంటికి తిరిగి వచ్చారు.

ఫోన్ వచ్చిందంటూ..

అంతా ఇంటికొచ్చి తిన్నాక పది గంటలకు సురేష్‌కు ఫోన్ వచ్చిందని బయటకు వెళ్లాడని మళ్లీ 11.15కు ఇంటికి వచ్చాడని, తిరిగి మళ్లీ ఫోన్ వచ్చిందంటూ బయటకు వెళ్లిపోయాడని మృతుడి భార్య చెబుతున్నారు. రాత్రి రోజులాగానే ఎదురింటిలో నివసిస్తున్న రుప్పా చంద్రశేఖర్ మేడ మీద (ఒక గది ఉంది) ఆరుబయట పిల్లలతో కలిసి నిద్రించడానికి తిరుమల వెళ్లారు. మధ్యలో అర్ధరాత్రి 12.15కు వాష్‌రూమ్ కోసం దిగి చూసే సరికి కుక్కలు అరవడం, ఇద్దరు వ్యక్తులు అటుగా తిరగడం తిరుమల చూశారు. అప్పటికీ తన భర్త సురేష్ రాకపోవడంతో నిద్రపోయారు. మళ్లీ రాత్రి 1:45 ప్రాంతంలో మెలకువ రావడంతో అలా లేచి చూసేసరికి కొద్ది దూరంలో భర్త రక్తపు మడుగులో కనిపించడంతో నిశ్చేష్టురాలినైపోయానని ఆమె తెలిపారు. తేరుకుని అన్నా, వదినా అంటూ కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందజేశారు.



రక్తపు మడుగులో సీరా సురేష్ (ఇన్‌సెట్లో) సురేష్ (ఫైల్)

పోలీసులు చూసేసరికి ..

సమాచారం అందుకున్న ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ ఘటనా స్థలికి వెంటనే చేరుకున్నారు. సీఐ లెంక సన్యాసినాయుడు, క్లూస్ టీమ్ కూడా చేరి హత్య జరిగిన ప్రదేశాన్ని, చుట్టు పక్కల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. మృతుని శవాన్ని పరిశీలించగా గొంతు, మెడ కత్తితో కోసి ఉండటం, కడుపులో మూడు కత్తి పోట్లు, చేతికి గాయమై ఉండడం కనిపించింది.

అనుమానాలు అనేకం..

మృతుడు సురేష్ 80 ఫీట్ రోడ్డు సమీప ఎస్బీఐ కాలనీలో మరో వివాహితతో గత కొంతకాలంగా సహజీవనం సాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ మహిళకు భర్త, ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. ఆమె కూడా హోటల్‌లోనే పనిచేస్తుంది. అంతేకాక భార్య తిరుమలతో మనస్పర్ధల కారణంగా ఈ ఏడాది జనవరిలో ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. దీనిపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఈ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆధారాలు సేకరిస్తున్నామని సీఐ సన్యాసినాయుడు పేర్కొన్నారు. మృతుని భార్య తిరుమల తనకు ఎవరిపైనా అనుమానాలు లేవని చెప్పడం గమనార్హం.

'శ్రీరాములు' సేవలు ఆదర్శనీయం

వజ్రపుకొత్తూరు రూరల్: గిరిజనోద్యమ నాయకులు కామ్రేడ్ బమ్మిడి శ్రీరాములు ఉద్యమానికి చేసిన సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మండలం నగరంపల్లిలో శుక్రవారం సీపీఎం నాయకులు నెయ్యిల మోహనరావు అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.తులసీదాస్, అఖిల భారత కార్మిక సంఘ నాయకులు దడాల సుబ్బారావుతో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. శ్రీరాములు విప్లవ సిద్ధాంతాలకు ఆకర్షితులై ఉద్యమబాట పట్టారని కమ్యూనిస్టు సిద్ధాంతాలను విశ్వసిస్తూ సుమారు 70 ఏళ్ల పాటు అనేక ఉద్యమాలు చేసి తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారని అన్నారు. గిరిజన, రైతుల పక్షాన నిలుస్తూ పోరాటంలో అజ్ఞాతవాసం చేశారని గుర్తు చేశారు. ముందుగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లతో నివాళులర్పించారు. కళాకారులు శిష్టు మనోజ్, ఎస్.చంద్రయ్య, టి.వైకుంఠరావు పాడిన పాటలు ఆలోచింపజేశాయి.



సంస్కరణ సభలో మాట్లాడుతున్న బి.తులసీదాస్

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కె.మోహన్‌రావు, సీపీఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, పీఎంసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు బి.మోహన్‌రావు, పి.పాపారావు, మాజీ సర్పంచ్ దువ్వాడ జయరాం చౌదరి, మన్యం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కార్మిక సంఘ నాయకులు టి.తిరుపతిరావు, వైద్యులు తెప్పల ఆనందరావు, ప్రజా సంఘాల నాయకులు వాసుదేవరావు, కుసుమ, బి.రామకృష్ణ, అరుణ్‌కుమార్, పైల చక్రవర్తి, అభిమానులు తదితరులు ఉన్నారు.

సిద్ధ వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్



ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్న సిద్ధ ఆయుర్వేదిక్ వైద్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సయాటికా జాయింట్ పెయిన్స్, పెరాలసిస్ వెర్టిగో, నరాల వాపులు వంటి వ్యాధులకు సిద్ధ ఆయుర్వేద పద్ధతిలో చికిత్స చేశారు. శ్రీకాకుళం నగరంలో చిన్నబజార్ రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శుక్రవారం అరసవల్లి ట్రస్ట్ బోర్డ్ సభ్యులు మండవల్లి రవి ఆధ్వర్యంలో సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ శ్రీనాథ్ రితిక్ అధిక సంఖ్యలో రోగులకు చికిత్స చేశారు. ఈ సందర్భంగా మండవల్లి రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ పద్ధతుల ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని, ఈ వైద్యం అందించేందుకు మరో నెల రోజుల్లో మరొకసారి ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సౌజన్యంతో భారీ ఎత్తున త్వరలో సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కీళ్ల నొప్పులు సయాటికా పెరాలసిస్ వ్యాధులతోపాటు కీళ్ల వాపులు, నరాల బలహీనత తదితర సమస్యలకు సంబంధించి ప్రాచీన వైద్య పద్ధతిలో చికిత్స అందజేస్తామని చెప్పారు.

జిల్లాకు కొత్తగా 8 బస్సులు

- జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: జిల్లాకు కొత్తగా 8 అల్ట్రా డీలక్స్ బస్సులు వచ్చాయని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. శ్రీకాకుళం ఒకటో డిపోకు ఒక బస్సు, టెక్కలి డిపోకు 4 బస్సులు, పలాస డిపోకు 3 అల్ట్రా డీలక్స్ బస్సులు వచ్చాయని తెలిపారు. పాతబస్సుల స్థానంలో ఈ కొత్తబస్సులు వచ్చాయని తెలిపారు. అలాగే అద్దె బస్సులకు సంబంధించిన టెండర్లు కూడా పూర్తయ్యాయని, ఆగస్టు నాటికి ఈ బస్సులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బస్సులను కూడా పంపించడం జరిగిందని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని డిపోలకు బస్సు లు చేరిపోయాయన్నారు. అదే విధంగా సార్వత్రిక ఎన్నికల అనంతరం దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం మళ్లీ వారి ప్రాంతాలకు వెళ్లేందుకు గత మూడు రోజులుగా కాంప్లెక్స్ ప్రయాణికులతో రద్దీమయంగా కనిపించిందని, ఈ రద్దీకి అనుగుణంగా బస్సులు వేసి ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చూశామని తెలిపారు.


వరకట్న వేధింపు కేసులో ఇద్దరికి జైలుశిక్ష

హిరమండలం:

వరకట్న వేధింపుల కేసులో భర్త, అత్తలకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సోంపేట సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ జి.నారాయణస్వామి అందించిన వివరాలిలా ఉన్నాయి. తంప గ్రామానికి చెందిన పెంటల హారతి అనే వివాహిత 2020 సంవత్సరంలో ఆత్మహత్య చేసుకుంది. భర్త బోయితి తిరుమలరావు, అత్త లిమ్మమ్మ వేధింపులు తాళలేక ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో పుట్టింటి వారి ఫిర్యాదులతో కేసు నమోదు చేసిన పాలకొండ డీఎస్పీ రారాజు ప్రసాద్ కేసు నమోదు చేశారు. నిందితులపై అభియోగాలు మోపుతూ కేసు వేశారు. పలుమార్లు విచారణ కొనసాగింది. శుక్రవారం కోర్టులో విచారణ జరిగింది. నిందితులపై నేరారోపణలు రుజువు కావడంతో న్యాయమూర్తి టి.భాస్కరరావు తీర్పు చెప్పారు. భర్త తిరుపతిరావుతో పాటు అత్త లిమ్మమ్మలకు ఏడేళ్ల పాటు జైలు శిక్ష విధించారు. బాధితుల తరఫున పీపీ కె.వెంకటరావు వాదించారు. హిరమండలం ఎస్ఐ నారాయణస్వామి నిందితులను హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

దేవుడి సొమ్ముకే శఠగోపం

- జిల్లాలో వరుస ఘటనలతో చర్చల్లోకి దేవదాయ శాఖ
- వెలుగులోకి సింగుపురంలో హుండీ అక్రమాలు, గుడివీధిలో నకిలీ రశీదులు



అరసవల్లి: జిల్లాలో దేవదాయ శాఖ తర చూ చర్చల్లోకి వస్తోంది. దేవుడి మొక్కుబడులన్నా, ఆలయ ఆదాయమన్నా, ఏమా త్రం ఖాతరు చేయకుండా కొందరు దేవదాయ శాఖ ఉద్యోగులు దోచేస్తున్నారు. ఆఖరికి దొంగ లెక్కలు రాసేస్తూ, నకిలీ రశీదు పుస్తకాలు, నకిలీ దర్శన టిక్కెట్లు సైతం విక్రయించేసి స్వామి ఆదాయానికి గండి కొడుతున్నారు. జిల్లాలో ఒకవైపు వ రుసగా పలు ఆలయాలల్లో దొంగలు పడి హుండీలు బద్దలుగొట్టి విగ్రహాలపై ఆభరణాలను కొట్టేస్తుంటే, మరోవైపు ఆ సంబంధిత శాఖకు చెందిన అధికార సిబ్బందే అక్రమాలకు పాల్పడుతున్నారు. శ్రీకాకుళం మండలం సింగుపురం కొండపై హటకేశ్వర స్వామి వారి ఆలయంలో ఉన్నతాధికారులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అక్రమంగా హుండీని తెరిచేసి లెక్కించేసి కొంత నగదును మాత్రమే రికార్డులకు ఎక్కించేశారు అక్కడి ఈఓ వెంకటరమణ. ఆయ నే దేవదాయ శాఖలో శ్రీకాకుళం డివిజన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా కూడా పనిచేస్తుండడం గమనార్హం. గత నెల 24న జరిగిన ఈ అనధికార హుండీ తెరిపించే ఘటనపై దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత స్పందించి విధుల నుంచి వెంకటరమణను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత తదుపరి చర్యలపై స్పందన లేకుండా పోయింది. ఇక ఇలాంటి వ్యవహారమే జిల్లా కేంద్రంలోని గుడివీధిలో శ్రీ ఉమారుద్రకోటేశ్వర స్వామి వారి ఆలయ ఉపాలయమైన శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయానికి చెందిన భూముల విషయంలోనూ చోటుచేసుకుంది. ఇక్కడి ఆలయ భూముల నుంచి రావాల్సిన వార్షిక శిస్తు లు రూ.2,20,400 నగదును నకిలీ రశీదులతో ఇక్కడి రెగ్యులర్ అటెండర్ వి.సతీష్ నొక్కేశాడు. ఈ వ్యవహారం ఈ నెల 7న వెలుగులోకి వచ్చింది. అయితే ఇక్కడి ఈఓ ఎం.సుకన్య వెంటనే స్పందించి అటెండర్ సతీష్‌ను ఏకంగా ఉద్యోగం నుంచే తొలగించి వన్ టౌన్‌లో ఎఫ్ఐఆర్ ఫైల్ చేయించారు. అయితే సింగుపురం కొండపై జరిగిన వ్యవహారంలో ఈఓను సస్పెండ్ చేసి ఉన్నతాధికారులు చేతులు దులుపుకుని ఊరుకున్నారే తప్ప తదుపరి చ ర్యలేవీ చేపట్టకపోవడంపై పలు అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. ఏదిఏమైనా వరుస ఘటనలు జిల్లా దేవదాయ శాఖలో చోటుచేసుకుంటున్నా అధికారుల స్పంద నలో జాప్యం జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు

సింగుపురం కొండపై జరిగిన అక్రమ అనధికారిక వ్యవహారంపై వెంటనే ఉన్నతాధికారులకు రిపోర్ట్ పంపించాను. సంబంధిత ఈఓ వెంకటరమణను సస్పెండ్ చేస్తూ డిప్యూటీ కమిషనర్ సుజాత ఆదేశాలను అమలు చేశాం. అయితే దీనిపై విచారణాధికారిని నియమించేలా డిప్యూటీ కమిషనర్ నుంచే ఆదేశాలు రావాల్సి ఉంది. విచారణలో నిజానిజాలు తేలనున్నాయి. అలాగే గుడివీధి వ్యవహారంలో పోలీసులు సతీష్‌పై కేసు నమోదు చేశారు. దీనిపై కూడా లోతైన విచారణ జరుగనుంది.

– టీఆర్‌వీవీ ప్రసాద్ పట్నాయక్, జిల్లా దేవదాయ శాఖాధికారి

వైభవంగా ఆలయ నిర్మాణం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని రాజువీధిలో గజేంద్రుడి ముఖాకృతిలో ఆలయాన్ని నిర్మించారు. దీనికోసం దేశంలోని పలు ప్రాంతాల్లో ఉన్నటువంటి దేవాలయాలను కమిటీ పరిశీలించింది. ఏనుగు తల రూపంలో నిర్మించడానికి సిద్ధమయ్యారు. దీనికోసం నయాగడ్ జిల్లా నుంచి మేస్త్రీలను తీసుకొచ్చారు. సుమారు ఆరు నెలల కృషితో నిర్మాణం పూర్తయ్యింది. ఈ దేవాలయ నిర్మాణం కోసం డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి రూ.5 లక్షలు, 5టీ చైర్మన్ వి.కార్తికేయ పాండ్యన్ రూ.5 లక్షలు, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని రు.3 లక్షలు విరాళంగా అందజేశారు. మిగతా అవసరమైన నిధులు భక్తులు నుంచి సేకరించారు. దేవాలయాన్ని జూన్‌లో ప్రారంభిస్తామని కమిటీకి చెందిన సంతుస్ కుమార్ పాత్రో ప్రకటించారు.



నిర్మితమైన దేవాలయం

ఇంజినీర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ప్రదానం



ఆసియా, పసిఫిక్ ఇంజినీరింగ్ సంస్థల సమాఖ్య (ఎఫ్ఈఐఏపీ) ప్రదానం చేసే ఇంజినీరు ఆఫ్ ది ఇయర్ అవార్డు ఈసారి రాష్ట్రానికి చెందిన రఘుపాత్రుని భీమారావుకు లభించింది. సమాఖ్య ప్రముఖుల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. – భువనేశ్వర్

సామూహిక లలితా సహస్ర నామ పారాయణ



సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ఎచ్చెర్ల వీధిలో సామూహిక లలితా సహస్రనామ పారాయణాలు శుక్రవారం పెద్ద ఎత్తున జరిగాయి. ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాల్లో భాగంగా మొండేటి వీధిలోని లలితాదేవి అమ్మవారి ఆలయం నుంచి షిర్డీ సాయి సేవా సంఘం, దివ్యటె క్స్‌టైల్స్ ఆధ్వర్యంలో గుజరాతీపేట రాజరాజేశ్వరీ లలీతా మహా త్రిపుర సుందరి పీఠం పర్యవేక్షణలో శంకరాచార్యుల చిత్రపటంతో ఊరేగింపు జరిగింది. వెయ్యి మంది మహిళలతో సామూహిక పారాయణాలు జరిగాయి. కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ, పెంట వశిష్ఠ కార్తికేయ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

నీలమణి దుర్గ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణి దుర్గ అమ్మవారి 49వ వార్షిక వారోత్సవాలు సందర్భంగా ఆలయం భక్తులతో శుక్రవారం కిటకిటలాడింది. స్థానికులతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించారు. యాగశాలలో అమ్మవారికి అష్టోత్తర శతనామార్చనలు, మూలమంత్ర, మండప దేవతా హోమాలు నిర్వహించామని ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ వాసుదేవరావులు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఏపీఎల్‌కు మకరాంపురం క్రికెటర్ ఎంపిక



క్రికెట్ క్రీడాకారుడు బెందాళం సాత్విక్ (ఫైల్)

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామానికి చెందిన బెందాళం సాత్విక్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్ టో ర్నమెంట్‌లో ఆడటానికి ఎంపికైనట్లు తండ్రి భోగేశ్వరరావు తెలిపారు. ఆయన ఈ మేరకు స్థానిక విలేకర్లతో శుక్రవారం మాట్లాడారు. సాత్విక్‌ను ఇటీవల నిర్వహించిన వేలం పాట లో గోదావరి లైన్స్ జట్టు లక్షా 60వేలకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. సాత్విక్ ఏడో తరగతి వరకు కంచిలిలో ఒక ప్రైవేటు పాఠశాలలోను, ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఆంధ్రా క్రికెట్ అకాడమీకి ఎంపిక కావడంతో వారే చదివించారని, డిగ్రీ సోంపేటలో ఒక ప్రైవేటు కళాశాలలో పూర్తిచేశాడన్నారు. ఇక అండర్-14లో రెండేళ్లు, అండర్-16లో ఒక సంవత్సరం, అండర్-19లో ఒక సంవత్సరం ఆడినట్లు తండ్రి భోగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం సీనియర్ జట్టు కు సైతం ఆడుతున్నట్లు తెలి పారు. గత రెండేళ్లుగా ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో గోదావరి టైటాన్స్ జట్టుకు ఆడిన సాత్విక్ ఈ ఏడాది ఉత్తరాంధ్ర లైన్స్ జట్టు కు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ అయినప్పటికీ లెఫ్ ఆర్మ్ స్పిన్ వేసి ఆల్‌రౌండర్‌గా గుర్తింపు సాధించాడు. సాత్విక్ ఎంపికపై స్థానిక క్రీడాకారులు అంతా అభినందనలు తెలిపారు.

కొత్త కర్ర చెరువులో ఆక్రమణల తొలగింపు

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని సంత సమీపంలో ఉన్న కొత్త కర్ర చెరువులో ఆక్రమణలకు ప్రయత్నించగా పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం అడ్డుకున్నారు. సర్వే నంబర్ 44 లో ఉన్న చెరువులో ఇప్పటికే కొంత మేర ఆక్రమణలకు గురి కాగా తాజాగా ఒకరు ఇంటి నిర్మాణం కోసం మట్టి వేశారు. ఎలాంటి అనుమతులు లేకపోవడం, చెరు వు గర్భం కావడంతో మట్టి పోసిన విషయాన్ని గమనించిన పంచాయతీ సిబ్బంది అదికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సవర చిన్నారావు, వీఆర్ఓ అఖిల, సర్వే యర్ శరణ్య, వీఆర్ఏ బండి రామారావు వెళ్లి కొలతలు వేసి చెరువులో వేసిన మట్టిని జేసీబీతో తొల గించారు. చెరువులో ఆక్రమణలకు పాల్పడవద్దని ఈఓ చిన్నారావు హెచ్చరించారు.



మట్టిని జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

19 నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాలు


శ్రీ కోదండరామస్వామివారి ఉత్సవ మూర్తులు

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ఈనెల 19వ తేదీ నుంచి శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వీవీ.సూర్యనారాయణ తెలిపారు. ఈనెల 19 నుంచి 23 వరకు పాంచాణిక దీక్షతో ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం ఘనంగా జరగనుందని, కల్యాణ మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

లెక్కలు చూపకుంటే చిక్కులే

- ఎన్నికల బరిలో నిల్చొన్న అభ్యర్థులు ఖర్చు వివరాలు చెప్పాల్సిందే..

విజయనగరం: సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. అలా అని పోటీచేసిన అభ్యర్థులు రిలాక్స్ అయిపోదామంటే కుదరదు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నుంచి ప్రచారం పూర్తయ్యే వరకు ఎన్నికల ఖర్చును అభ్యర్థులు పక్కాగా ఎన్నికల సంఘానికి చూపాల్సిందే. లేకుంటే భవిష్యత్తులో చిక్కులు తప్పవు మరి. శాసనసభ ఎన్నికలకు ఎంత ఖర్చు చేయాలి, లోక్‌సభ ఎన్నికలకు ఎంత ఖర్చు చేయాలన్నది ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 చట్టం సెక్షన్ 19లో వివరించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మె ల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న అభ్యర్థి వ్యయ పరిమితి రూ.40 లక్షలుగా, ఎంపీ స్థానానికి పోటీచేసే అభ్యర్థి వ్యయ పరిమితి రూ.95 లక్షలుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. అభ్యర్థులు చేసే ఖర్చుపై వివరాలను ఎప్పటికప్పుడు షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లో నమోదు చేస్తుంటారు. నిర్ణీత వ్యయ పరిమితికి మించి ఒక్క రూపాయి ఖర్చు దాటినా, అందుకు సంబంధించిన లెక్కలను సరైన ఆధారాలతో సమర్పించాలి. అలా, చూపకుంటే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 10ఏ ప్రకారం పోటీ చేసిన వ్యక్తి అభ్యర్థిత్వాన్ని ఎన్నికల సంఘం రద్దు చేసే అవకాశం ఉంటుంది. దీంతో పాటు వచ్చే మూడేళ్ల పాటు స్థానిక, శాసనసభ ఎన్నికలు సహా ఏ ఎన్నికల్లోనూ పోటీ చేసేందుకు అవకాశం లేకుండా అనర్హత వేటు వేస్తుంది.


ధైర్యలక్ష్మికి అభిషేకం


అమ్మవారికి అభిషేకం జరిపిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువైన అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధైర్యలక్ష్మి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ ధైర్యలక్ష్మికి పంచామృతభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని ఆలయ ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులతో పాటు వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

ఒడిశా సరిహద్దుకు ఏనుగులు

భామిని: ఏనుగుల గుంపు వంశధార నది ఆవల ఒడిశా సరిహద్దు గ్రామాలకు శుక్రవారం తరలి వెళ్లాయి. ఒడిశా కాశీనగర్ బ్లాక్ బూదర, బొత్తవ, గొరిబంద గ్రామాల సమీపంలోకి ఏనుగుల గుంపు చేరుకున్నాయి. భామిని మండలం తాలాడ సమీపంలోని తోటలో కొద్ది నెలలుగా తిష్టవేసిన నాలుగు ఏనుగుల గుంపు తరలివెళ్లడంతో తాలాడ, బాలేరు, ఘనసర, కీసర, కోసలి గ్రామాల రైతులు ఊపిరి పీల్చుకున్నారు.


తాలాడ వద్ద వంశధార నదిని దాటుతున్న ఏనుగులు

ప్రభుత్వ బడుల్లో సీబీఎస్ఈ

చదువుతోనే పిల్లలకు ఉజ్వల భవిత సొంతమవుతుందని.. వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయన్న ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. సర్కారు బడుల్లో సంస్కరణలు చేపట్టింది. నాడు-నేడు కింద సకల సదుపాయాలు కల్పించింది. డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. బైలింగ్వెన్ విధానంలో పుస్తకాలు ముద్రించింది. తాజాగా కార్పొరేట్ స్కూల్స్‌లో చదువుకున్న విద్యార్థులకు బోధించే సీబీఎస్ఈ సిలబస్‌ను సర్కారు బడుల్లో బోధనకు చర్యలు చేపట్టింది. ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తోంది.


శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

- తొలివిడతగా 40 పాఠశాలల ఎంపిక
- ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు

సాక్షి, పార్వతీపురం మన్యం:

జిల్లాలో పిక చేసిన ప్రభుత్వ బడుల్లో సీబీఎస్ఈ బోధనను ఉచితంగా అమలు చేయనున్నారు. పిల్లలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. ఇందుకోసం జిల్లాలోని 40 పాఠశాలలను తొలుత ఎంపిక చేశారు. బడుల్లో బట్టీ విధానానికి, మూస పద్ధతికి స్వస్తి పలికి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిలబస్‌ను అమలు చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రకియపై విద్యాశాఖ ఆధ్వర్యంలో కురుపాంలో 140మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం

ఇప్పటివరకు కార్పొరేట్, ఇతర ప్రత్యేక పాఠశాలల్లోనే సీబీఎస్ఈ విధానం అమలవుతోంది. ప్రస్తుతం నడుస్తున్న పోటీ ప్రపంచంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలంటే సీబీఎస్ఈ సిలబస్ కచ్చితంగా ఉండాలి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల విద్యార్థులకూ ఇటువంటి బోధన అందించాలన్న సంకల్పంతో చర్యలు తీసుకుంది. అన్ని రకాల వనరులూ ఉండి, పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో దీన్ని ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు చేస్తున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఈ బోధన ద్వారా చదువుకునే అవకాశం ఉంటుంది. ఆయా విద్యాలయాల పర్యవేక్షణ కేంద్రం పరిధిలోకి వెళ్తుంది. విద్యార్థుల ఆసక్తి, అభిరుచిని గుర్తించి వివిధ రంగాల్లో వారిని ప్రోత్సహిస్తారు. సబ్జెక్టుల మేరకు అవసరమైన ఉపాధ్యాయులను నియమిస్తారు.

జిల్లాలో సీబీఎస్ఈకి ఎంపికైన పాఠశాలలు ఇవే...




ఏపీఎంఎస్- పురోహితునివలస (సాలూరు), ఏపీఎంఎస్- మునక్కాయవలస(మక్కువ), ఏపీ మోడల్‌స్కూల్ (భామిని), ఏపీఎంఎస్ (కురుపాం), ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (భామిని), ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (పీఎన్ బొండవలస), ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ బాలికలు (గరుగుబిల్లి), ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ (కొమరాడ), కేజీబీవీ (సీతంపేట), కేజీబీవీ (భామిని), కేజీబీవీ (వీరఘట్టం), కేజీబీవీ (మక్కువ), కేజీబీవీ (జోగింపేట), కేజీబీవీ(బలిజిపేట), కేజీబీవీ (చినమేరంగి), కేజీబీవీ(సాలూరు), కేజీబీవీ (కవిటిభద్ర), కేజీబీవీ(కురుపాం), కేజీబీవీ (గుమ్మలక్ష్మీపురం), కేజీబీవీ (కొమరాడ), కేజీబీవీ (గరుగుబిల్లి), కేజీబీవీ(పాచిపెంట), ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలురు (మల్లి), ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలికలు(సీతంపేట), ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలురు (సీతంపేట), ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలికలు(భద్రగిరి), ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలురు(కొమరాడ), ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలురు (కోనవలస), ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలికలు (బెలగాం), ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలికలు (భద్రగిరి), జీటీడబ్ల్యూఏహెచ్ (మల్లి), జీటీడబ్ల్యూఏహెచ్ఎస్ (హడ్డుబంగి), జీటీడబ్ల్యూఏఎస్ (కొత్తగూడ), జెడ్పీహెచ్ఎస్ (బలిజిపేట), జెడ్పీహెచ్ఎస్ (మక్కువ), జెడ్పీహెచ్ఎస్ (పాచిపెంట), జెడ్పీహెచ్ఎస్(ఎమ్మార్‌నగరం), కేపీఎంహెచ్ఎస్- కొత్తవలస(పార్వతీపురం).

విద్యార్థులకు ఉపయోగకరం

పోటీ ప్రపంచంలో విద్యార్థులు సామర్థ్యాన్ని పెంచుకుని జాతీయ పరీక్షలకు హాజరు కావడానికి సీబీఎస్ఈ సిలబస్ దోహదపడుతుంది. సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం.
– పగడాలమ్మ, జిల్లా విద్యాశాఖాధికారిణి

● స్వర్ణ శోభితం..


భానుడి లేలేత కిరణాలకు బంగారు వర్ణంలో కనిపిస్తున్న ఆకాశం


మబ్బుల మధ్యలో ఇంద్రధనస్సు

పాలకొండ ఏజెన్సీ ప్రాంతంలో గత రెండు రోజులుగా చిరు జల్లులు కురుస్తున్నాయి. శుక్రవారం సూర్యోదయానికి ముందే చిన్నచినుకులు కురవగా.. ఆకాశంలో విరిసిన ఇంద్ర ధనస్సు చూపరులను ఆకట్టుకుంది. స్వర్ణ శోభిత వర్ణంలో ఆకాశం కాసేపు ఆహ్లాదాన్ని పంచింది. ఈ సుందర దృశ్యాలను పాలకొండ వాసులు డాబాలపై నుంచి సెల్ ఫోన్‌లలో బంధించి మురిసిపోయారు.
– పాలకొండ

జీవనశైలిలో మార్పులే రక్తపోటుకు కారణం

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జీవనశైలిలోని మార్పులే రక్తపోటుకు కారణమని, సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో రక్తపోటుకు దూరంగా, ఆరోగ్యంగా జీవించవచ్చని డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా విజయనగరం పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపోటును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. రక్తపోటు పెరిగితే పక్షవాతం, గుండె పోటు వచ్చే అవకాశం ఉందన్నారు. మద్యపానం, దూమపానం, కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రతిరోజు వ్యాయమం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ఓ డాక్టర్ కె.రాణి, ఎపిడిమాలజిస్టు డాక్టర్ జి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సంతోషి మృతికి టీడీపీ నాయకులే కారణం

- ఆమె కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం ఇవ్వాలి
- వైఎస్సార్ సీపీ నాయకులు, దుప్పాడ గ్రామ వలంటీర్ల డిమాండ్


మాట్లాడుతున్న పీఏసీఎస్ అధ్యక్షుడు త్రినాథ్

విజయనగరం రూరల్: నిష్పక్షపాతంగా ప్రజలకు ఐదేళ్లపాటు సేవలందించిన గ్రామ వలంటీర్ బొబ్బాది సంతోషి మృతికి కారణమైన టీడీపీ నాయకులు ఆమె కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని దుప్పాడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. విజయనగరం మండలం దుప్పాడ గ్రామ సచివాలయం పరిధిలో వలంటీర్‌గా సేవలందిస్తున్న బొబ్బాది సంతోషి (36) శుక్రవారం గుండెపోటుతో మరణించింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ వలంటీర్లు ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శ్మశానం సమీపంలోనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీపీ నేతల రాజకీయ కక్ష సాధింపులే సంతోషి మృతికి కారణమన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున సంతోషి ప్రచారం చేసిందంటూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదుతో విజయనగరం ఎంపీడీఓ విచారణ చేయకుండానే ఏకపక్షంగా చర్యలకు ఉపక్రమించడం.. పోలీసులు విచారణ పేరిట ఆమెకు ఫోన్లు చేయడంతో పేద కుటుంబానికి చెందిన సంతోషి ఆందోళనకు గురై గుండెపోటుతో మరణించిందని ఆరోపించారు. ముఖ్యంగా మహిళా వలంటీర్లపైనే టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేసి వేధింపులకు గురి చేశారన్నారు. ఇద్దరు చిన్న పిల్లలు ఉన్న వలంటీర్ మరణానికి కారణమైన టీడీపీ నాయకులు ఆమె కుటుంబానికి తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఆమె కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, వైస్ సర్పంచ్ బద్రి భాస్కరనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుమజ్జి రామలప్పుడు, చందక పరుశురాం, మాజీ ఉప సర్పంచ్ పైడిరాజు, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐతో ఉద్యోగ అవకాశాలు


భద్రగిరిలో ఉన్న ప్రభుత్వ ఆర్ఐటీఐ కళాశాల


భద్రగిరి ప్రభుత్వం ఆర్ఐటీఐ వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో ప్రవేశాలకు తొలిదశ నోటిఫికేషన్ విడుదల
- వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు జూన్ 10 తుది గడువు

గుమ్మలక్ష్మీపురం:

పదో తరగతి ఫలితాలు వెలువడ్డాయి. పాలిసెట్, రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు కూడా వచ్చాయి. విద్యార్థులు వారి ఆసక్తిని బట్టి ఏ కోర్సులో చేరాలన్నదానిపై ఆలోచన చేస్తున్నారు. అధిక శాతం మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరనుండగా, పలువురు విద్యార్థులు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సుల్లో చేరేందుకు మొగ్గుచూపుతున్నారు. పదోతరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందాలనుకునేవారికి ఐటీఐ కోర్సులు మంచివని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

18 ఏళ్లు దాటగానే..

ఐటీఐ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటీస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఐటీఐ ఒక చక్కని మార్గం. విద్యుత్, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు త్వరితగతిన లభిస్తాయి. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్స్ తప్పనిసరి. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహం లేదు. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఐటీఐ కోర్సు దోహదపడుతుంది.

ఏడాది, రెండేళ్ల కాలపరిమితి కోర్సులు..

ఐటీఐల్లో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ కోర్సులు ఉంటాయి. రెండేళ్ల కాల పరిమితితో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిల్, డ్రాఫ్ట్‌మేన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానికల్ వంటి కోర్సులు ఉంటాయి. ఏడాది కాల పరిమితితో డీజిల్ మెకానిక్, వెల్డర్, కటింగ్ అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రొగ్రాం అసిస్టెంట్ తదితర కోర్సులు ఉంటాయి.

ఆసక్తి ఉన్న కోర్సుల ఎంపికే ప్రధానం

పార్వతీపురం మన్యం జిల్లాల్లోని భద్రగిరి, సీతంపేట, సాలూరు మండలాల్లో మూడు ప్రభుత్వ, ఐదు ప్రైవేటు ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. ఐటీఐలలో చేరే విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్నకోర్సులు ఎంపిక చేసుకోవడం ఉత్తమం. ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసేందుకు జూన్ 10వ తేదీ తుది గడువుగా ఉపాధి, శిక్షణ శాఖ ప్రకటించింది.

ఉన్నత చదువులకు అవకాశం

ఐటీఐ కోర్సుల్లో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు అనంతరం బీటెక్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపర్చుకోవడానికి కూడా ఒక చక్కని అవకాశంగా దోహదపడుతుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఐటీఐలో చేరేందుకు ఆసక్తిచూపే విద్యార్థులు జూన్ 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పరిశీలన సమయంలో సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరుకావాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల మొబైల్ నంబర్లకు పంపిస్తాం. పదో తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్లు ఉంటాయి.

లేఆఫ్ ప్రకటించిన జిందాల్ స్టీల్

- ముడిసరుకు కొరతే కారణమంటూ నోటీస్ జారీ
- ఆందోళనకు దిగిన కార్మికులు
- యాజమాన్య ప్రతినిధులతో చర్చించిన కార్మిక సంఘాల నాయుకులు


మూతపడిన జిందాల్ కర్మాగారం

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టీల్స్ కర్మాగార యాజమాన్యం శుక్రవారం తెల్లవారు జామున లేఆఫ్‌ను ప్రకటించింది. దీనికి సంబంధించిన వివరాలతో కూడిన నోటీసును కర్మాగారం ప్రధానగేటు వద్ద అతికించింది. ప్రధాన గేటుకు తాళాలను వేయించింది. ఉదయం ఎ-షిఫ్టుకు వచ్చిన కార్మికులు నోటీసును చూసి కంగుతిన్నారు. ఈ విషయాన్ని మిగిలిన కార్మికులకు చేరవేయడంతో కార్మికులందరూ చేరుకుని గేటు వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. పరిశ్రమలో రెగ్యులర్ కార్మికులుగా 57 మంది, కాంట్రాక్ట్ కార్మికులుగా 280 మంది పని చేస్తున్నారు. గడిచిన అక్టోబర్ నెల నుంచి కర్మాగారానికి అవసరమైన ముడిసరుకు లభ్యం కాకపోవడం, ఉత్పత్తికి గిరాకీ లేకపోవడం తదితర కారణాలతో నష్టాలు వస్తున్నాయని, తప్పనిసరి పరిస్థితిలో కర్మాగారం మూసివేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించింది. ఇక్కడి కార్మికులకు జిందాల్‌కు చెందిన జోజ్‌పూర్‌లోని మరో యూనిట్‌లో పనికల్పిస్తామని పేర్కొంది. దీనికి తొలుత అభ్యంతరం తెలుపుతూ సుమారు 330 మంది కార్మికులు కర్మాగారం గేటు వద్ద ఆందోళన చేశారు. కర్మాగారం తెరిచి పనికల్పించాలని డిమాండ్ చేశారు. కర్మాగారం నష్టాల్లో ఉన్నప్పుడు తక్కువ వేతనానికే పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. సమాచారం అందుకున్న కొత్తవలస సీఐ ఎస్.చంద్రశేఖర్ కర్మాగారం వద్దకు చేరుకుని ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు.


కర్మాగారం ఎదుట ఆందోళనకుదిగిన కార్మికులు

యాజమాన్యంతో చర్చలు జరిపిన కార్మిక సంఘ నాయుకులు

కర్మాగార యాజమాన్యం ప్రతినిధులైన యూనిట్ ఇన్‌చార్జి దినేష్‌శర్మ, హెచ్ఆర్ మేనేజర్ గోపాలకృష్ణతో కార్మిక సంఘాల నాయకుడు, వైఎస్సార్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు, టీఎన్‌టీయూసీ, సీఐటీయూ సంఘాల నాయకులు బూసాల అప్పారావు, బి.సురేష్ చర్చలు జరిపారు. ప్రస్తుత నెలకు సంబంధించి కార్మికులకు పూర్తి జీతం ఇవ్వాలని, జోజ్‌పూర్ యూనిట్‌కు వెళ్లే కార్మికులకు జీతాలు పెంచాలని, భోజనం, వసతి సౌకర్యాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఇక్కడి యూనిట్‌కు ముడిసరుకు సమకూర్చితే 20 రోజుల వేతనానికి నెలంతా కార్మికులు పనిచేస్తారని స్పష్టంచేశారు. దీనిపై యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ఈ అంశాలను యాజమాన్య ప్రతినిధులతో చర్చించి సాధ్యాసాధ్యాలను సోమవారం వెల్లడిస్తామని తెలిపారు. యాజమాన్యం తమ వైఖరి తెలిపే వరకు ఆందోళన కొనసాగుతుందని కార్మిక సంఘాల నాయుకులు తెలిపారు.


యాజమాన్య ప్రతినిధులతో చర్చిస్తున్న కార్మిక సంఘాల నాయకులు నాయుడుబాబు, తదితరులు

అప్పట్లో 11 నెలలు మూతపడిన పరిశ్రమం

2020-21లో సుమారు 11 నెలల పాటు కర్మాగారం మూతపడింది. దీంతో ప్రభుత్వం రంగప్రవేశం చేసి ప్రత్యేక రాయితీలను కల్పించి తెరిచేందుకు సహకరించింది. ప్రస్తుతం కర్మాగారాన్ని ఆర్థాంతరంగా మూసేస్తే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కర్మాగారంలో పనిచేసే కార్మికుల్లో 50 శాతం మంది రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్నారు. ఈ సమయంలో వేరే రాష్ట్రంలోని యూనిట్‌లో పనికి పంపిస్తామంటే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. కార్మికుల ఆందోళనకు అప్పలన్నపాలెం, నిమ్మలపాలెం, ఉత్తరాపల్లి గ్రామాల సర్పంచ్‌లు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వివిధి కార్మిక సంఘాల ప్రతినిధులు పప్పల బంగారనాయుడు, లగుడు వామాలు, గాడి అప్పారావు, ఎన్.చిన్నబాబు, ఎస్.భీమయ్య, బి.రమణ, బి.ఈశ్వరరావు, బి.రాము, తదితరులు పాల్గొన్నారు.



కర్మాగార గేటు వద్ద అతికించిన లేఆఫ్ నోటీస్